సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

ఆదివారం । 26 । ఫిబ్రవరి । 2023



చీనీ టన్ను రూ.37 వేలు
అనంతపురం మార్కెట్‌యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.37 వేలు పలికాయి. మార్కెట్‌కు 539 టన్నుల కాయలు వచ్చాయి.



టమాట కిలో రూ.22
అనంతపురం శివారులోని కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్టంగా రూ.22, కనిష్టం రూ.5, సరాసరి ధర రూ.10 పలికింది.



జిల్లా పరిధిలో శనివారం ఉదయం చలి తీవ్రత ఉంది. పగటి ఉష్ణోగ్రత స్థిరంగా నమోదు కాగా.. రాత్రి తగ్గుముఖం పట్టింది.

టీడీపీకి మూడునట్లేనా?!

పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ, అనంతపురం స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ఘట్టం ముగిసింది. ఉమ్మడి అనంతపురం జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ కోటా కింద వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా నామినేషన్ వేసిన ఎస్.మంగమ్మ ఏకగ్రీవానికి మార్గం సుగమమైంది. సకల జనుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలను తెలియజేస్తూ వైఎస్సార్ సీపీ అభ్యర్థులు ప్రచారంలో దూసుకుపోతుండగా, టీడీపీ అభ్యర్థులు మాత్రం ప్రచారంలో వెనుకబడిపోయారు. ఓటమి భయంతో పార్టీ ముఖ్య నేతలు కూడా సహకరించకపోవడంతో డీలాపడ్డారు. గెలుపు సంగతి దేవుడెరుగు కనీసం రెండో స్థానంలోనైనా నిలిచి పరువు నిలబెట్టుకోవాలని భావిస్తే అదీ జరిగేలా కనిపించడం లేదు.



- ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్న వైఎస్సార్ సీపీ
- ముఖ్య నేతల అండతో ఉత్సాహంగా అభ్యర్థుల ప్రచారం
- ఇప్పటికే మంగమ్మ విజయదరహాసం
- టీడీపీ అభ్యర్థుల తరఫున కానరాని ఆ పార్టీ నేతాగణం
- మొదట్లో అభయమిచ్చి ఇప్పుడు చేతులెత్తిన అధినాయకత్వం
- పీడీఎఫ్ అభ్యర్థే మెరుగ్గా ఉన్నట్లు తేలడంతో అంతర్మథనం

సాక్షి ప్రతినిధి, అనంతపురం: అధికారంలో ఉన్నన్నాళ్లు టీడీపీ ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసింది. ప్రతిపక్షంలోకొచ్చాక కూడా ప్రజలపక్షాన నిలబడలేదు. దీంతో పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాల్లో పోటీ చేస్తున్న ఆ పార్టీ అభ్యర్థుల గెలుపోటములు పక్కన పెడితే పార్టీ ఉనికికే ప్రమాదం ఏర్పడింది. ఏ ముఖం పెట్టుకుని ఓట్లడగాలో నేతలకు పెద్ద సంశయంగా మారింది.

ఎవరికి వారే యమునా తీరే..

ఉమ్మడి అనంత జిల్లాలో టీడీపీ హయాంలో పరిటాల సునీత, కాలవ శ్రీనివాసులు మంత్రి పదవులు అనుభవించారు. ఆ సమయంలో ప్రజలకు పీసమెత్తు లబ్ధి చేకూర్చలేకపోయారు. దీంతో 2019 ఎన్నికల్లో 14 ఎమ్మెల్యే సీట్లకు 12 సీట్లను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ప్రజలు కట్టబెట్టారు. అధికారం కోల్పోగానే టీడీపీ నాయకులు కకావికలమయ్యారు. మరోవైపు వైఎస్సార్ సీపీ సర్కార్ కుల, మత, రాజకీయాలకు అతీతంగా అందరికీ లబ్ధి చేకూరుస్తోంది. దీంతో ప్రజలకు తెలుగుదేశం పార్టీ నాయకుల అవసరమే లేకుండా పోయింది. ఈ క్రమంలోనే ఆ పార్టీ నాయకులు కొన్నాళ్లుగా ఒంటరిగా మిగిలారు.

మూడుకు వెళితే అంతే సంగతులు..

తాజా ఎమ్మెల్సీ నామినేషన్లలో స్థానిక సంస్థల కోటా కింద వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మంగమ్మ ఎన్నిక ఏకగ్రీవం కానుంది. ఇక మిగిలింది పట్టభద్రులు, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నిక. ఇందులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున పట్టభద్రులకు వెన్నపూస రవీంద్రారెడ్డి, టీచర్స్ ఎమ్మెల్సీకి రామచంద్రారెడ్డి పోటీలో ఉన్నారు. ఇప్పటికే వీళ్లిద్దరూ మూడు జిల్లాలూ చుట్టి వచ్చారు. టీచర్స్ స్థానంలో అభ్యర్థిని కూడా బరిలో నిలపని టీడీపీ... ఏపీటీఎఫ్ అభ్యర్థి ఒంటేరు శ్రీనివాసరెడ్డికి మద్దతు తెలిపి పోరు నుంచి నిష్క్రమించింది. ఇక మిగిలిన టీడీపీ పట్టభద్రుల అభ్యర్థి పరిస్థితి మాత్రం ఘోరంగా ఉంది. దీంతో రెండోస్థానం రాకుండా మూడో స్థానానికి పరిమితమైతే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ పరిస్థితి ఏంటన్న సందేహం నాయకులను వేధిస్తోంది. పట్టభద్రుల ఎన్నికలో టీడీపీ కంటే పీడీఎఫ్ అభ్యర్థే కాస్త మెరుగ్గా ఉన్నట్లు జనంలో చర్చ జరుగుతోంది.

స్టార్లు క్యాంపెయినర్లు లేరు..

టీడీపీ అభ్యర్థులు ఎమ్మెల్సీ టికెట్ తీసుకుని గుదిబండను మోస్తున్నామా అన్న భావనలో ఉన్నట్టు తెలుస్తోంది. ఓవైపు వైఎస్సార్ సీపీ అభ్యర్థుల తరఫున ఎమ్మెల్యేలు, మంత్రులు ప్రచారం నిర్వహిస్తుండగా, టీడీపీలో అభ్యర్థులను పట్టించుకునే దిక్కే లేదు. దీంతో అనవసరంగా పోటీలో దిగామా అన్న మీమాంస వారిని వెంటాడుతోంది. 2019లో ఉమ్మడి జిల్లాలో ఇద్దరు టీడీపీ ఎమ్మెల్యేలు గెలిస్తే ఒకరేమో నియోజకవర్గానికే రారు, మరొకరు బిజీగా ఉంటున్నారు. ఈక్రమంలో ప్రచారమనే ఊసే లేకుండా పోయింది.

ఫేస్‌బుక్‌ను.. టెలీకాలర్‌ను నమ్ముకుని..

అధిష్టానం పరిస్థితి చూసి టీడీపీ అభ్యర్థులు విస్తుపోతున్నారు. విధిలేక ఫేస్‌బుక్‌ను, టెలీకాలర్‌ను నమ్ముకున్నారు. తరచూ ఫేస్‌బుక్‌లో పోస్టులు పెట్టడం, టెలీకాలర్ ద్వారా నంబర్లకు ఫోన్‌లు చేయడం మాత్రమే చేస్తున్నారు. ఏ నియోజకవర్గంలోనూ నేతలు సహకరించడం లేదన్న విషయం అభ్యర్థులకు తెలియడంతో డీలాపడిపోయారు. ఎరక్కపోయి ఇరుక్కున్నామన్న చందమైందని వారు వాపోతున్నట్టు తెలిసింది.

బోరు బావుల కింద సాగుకు కే–6 బెస్ట్

- ప్రధాన వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ సంపత్‌కుమార్

కదిరి: రబీ, ఖరీఫ్ సీజన్లలో బోరు బావుల కింద సాగు చేయడానికి కదిరి–6(కే–6) వేరుశనగ రకం చాలా మేలైనదని కదిరి వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డా.సంపత్‌కుమార్ సూచించారు. శనివారం స్థానిక పరిశోధన కేంద్రంలో 'పంటల సాగు–వాటి స్థితిగతులు' అనే అంశంపై జిల్లా స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డా.సంపత్ మాట్లాడుతూ..వర్షాధార పంటగా కే–9 లేదా కదిరి లేపాక్షి రకం వేరుశనగ వేసుకుంటే అధిక దిగుబడి వస్తుందన్నారు. నీటి వసతి కింద సాగు చేయాలంటే కే–6 వేరుశనగ రకం మించింది లేదన్నారు. వ్యవసాయాధికారులు రైతులకు అందుబాటులో ఉంటూ పంటల సాగు, తెగుళ్ల నివారణపై ఎప్పటికప్పుడు సూచనలు, సలహాలు ఇవ్వాలని సూచించారు. అలాగే ప్రభుత్వం అందించే సబ్సిడీలు, పంటనష్ట పరిహారం తదితర వాటిని రైతులు పొందేందుకు సాయంగా ఉండాలన్నారు. అనంతరం పలువురు ఏడీలు మాట్లాడుతూ...



మాట్లాడుతున్న వ్యవసాయ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సంపత్‌కుమార్

రబీలో లక్ష్యానికి మించి వివిధ రకాల పంటలు సాగులోకి వచ్చాయన్నారు. ఈ క్రమంలో జిప్సం వాడకం పెరిగిందన్నారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా జిప్సం కొరత ఉందని, రైతు భరోసా కేంద్రాల ద్వారా ఇండెంట్‌పై సరఫరా చేస్తూ బాటుంటుందన్నారు. దీంతో ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని అధికారులు నిర్ణయించారు. సమావేశంలో జిల్లా వనరుల కేంద్రం సహాయ సంచాలకులు విద్యావతి, వ్యవసాయ శాస్త్రవేత్తలు డా.ప్రసన్న రాజేష్, డా.కె.వేమన, డా. వెంకటరమణ, జిల్లాలోని అని డివిజన్ల ఏడీఏలు, ఏఓలు పాల్గొన్నారు.

రైళ్లలో చోరీ చేసే అంతర్రాష్ట్ర ముఠా అరెస్ట్

- రూ.2.01 లక్షలు నగదు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం



అంతర్రాష్ట్ర దొంగలను చూపుతున్న రైల్వే జీఆర్‌పీ సీఐ, ఎస్‌ఐలు

ధర్మవరం అర్బన్: రైలు ప్రయాణికులతో మాట కలుపుతారు...మత్తుమందు కలిపిన తినుబండారాలు, తాగునీళ్లిస్తారు. వారు మైకంలోకి జారుకోగానే అంతా సర్దేస్తారు. ఇలా పలుచోట్ల రైలు ప్రయాణికులను నిలువునా దోచేసిన అంతరాష్ట్ర ముఠాను రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. ధర్మవరం రైల్వేస్టేషన్‌లో ధర్మవరం రైల్వే జీఆర్‌పీ సీఐ నాగరాజు, హిందూపురం రైల్వే ఎస్‌ఐ బాలాజీ నాయక్, ధర్మవరం జీఆర్‌పీ ఎస్‌ఐ గోపీకుమార్ తెలిపిన వివరాల మేరకు... ఉత్తరప్రదేశ్‌కు చెందిన మనోజ్‌కుమార్‌సింగ్, సోను శుక్ల, రాజమణి ఈజీ మనీ కోసం చోరీల బాట పట్టారు. రైళ్లలో ప్రయాణిస్తూ తోటి ప్రయాణికులతో మాటలు కలుపుతారు. మత్తుమందు కలిపిన పదార్థాలు ఇచ్చి...చోరీలకు తెగబడుతున్నారు. ఈ క్రమంలోనే శనివారం విశ్వసనీయ సమాచారం మేరకు... ధర్మవరం రైల్వేస్టేషన్‌లో వీరిని రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్దనుంచి రూ.2.01 లక్షల నగదుతో పాటు మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. రైళ్లలో పరిచయం లేని వ్యక్తులు ఇచ్చే తినుబండారాలు తినకూడదని జీఆర్‌పీ సీఐ నాగరాజు సూచించారు.

సత్యసాయి అమ్మప్రేమకు రూపం

- మహిళలను మహోన్నతంగా చూసిన బాబా
- 'మహిళా సాధనా శిబిర్'లో వక్తలు



ప్రసంగిస్తున్న గీతామోహన్‌రామ్

ప్రశాంతి నిలయం: "నేను ఐదు దశాబ్దాలుగా సత్యసాయి మార్గంలో పయనిస్తూ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సేవల్లో తరిస్తున్నా.. సత్యసాయి ఆధ్యాత్మిక ప్రవచనాలతో పాటు అమ్మవంటి కమ్మనైన ప్రేమను భక్తకోటికి పంచారు. అందుకే ప్రతి మదిలో ఆయన అమ్మగా శాశ్వత స్థానం పొందారు" అని అమెరికాకు చెందిన సత్యసాయి భక్తురాలు గీతా మోహన్ రామ్ అన్నారు. ప్రశాంతి నిలయంలో జరుగుతున్న 'మహిళా సాధనా శిబిర్' సదస్సు రెండో రోజు శనివారం పలు కార్యక్రమాలు జరిగాయి. ఉదయం సత్యసాయి మహాసమాధి చెంత వేదపఠనంతో కార్యక్రమం ప్రారంభమైంది. జమ్మూ కాశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, జార్ఖండ్, పశ్చిమబెంగాల్, డార్జిలింగ్, మేఘాలయ తదితర రాష్ట్రాల్లో సత్యసాయి సేవా ఆర్గనైజేషన్స్ చేస్తున్న సేవలను వివరిస్తూ డిజిటల్ స్క్రీన్‌లపై ప్రదర్శన నిర్వహించారు. అనంతరం సత్యసాయి సేవా సంస్థల్లోని వివిధ విభాగాల్లో సుదీర్ఘ కాలం పాటు సేవలందిస్తున్న మహిళలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గీతా మోహన్ రామ్ మాట్లాడుతూ... సత్యసాయి తన సేవా మార్గంలో మహిళలకూ చోటు కల్పించి వారి ఆదర్శ జీవితాన్ని ఆధునిక లోకానికి పరిచయం చేశారన్నారు. ఆయన చూపిన మార్గం నేటి తరం మహిళలకు ఆదర్శమన్నారు. అనంతరం ఢిల్లీ భజన బృందం సంగీత కచేరీ నిర్వహించింది. సాయంత్రం ఆధునిక సమాజంలో మహిళ పాత్ర, సమాజాభివృద్ధిలో మహిళల భాగస్వామ్యం అనే అంశంపై చర్చ నిర్వహించారు. విద్యా వాహిని డైరెక్టర్ కరుణా మున్షి, సిమ్స్ సీటీవీఎస్ విభాగాధిపతి నీలందేశాయ్, సత్యసాయి విద్యాసంస్థల కామర్స్ విభాగాధిపతి డాక్టర్ సుమతిరావు, రాజేశ్వరి, డాక్టర్ అఖిలా ఇందుర్తి, అంకిత, సాయిసుధ చర్చలో పాల్గొన్నారు. చివర్లో కర్ణాటకకు చెందిన మహిళా వాయిద్యకారులు తమ వాయిద్య కచేరీతో భక్తులను మంత్రముగ్ధులను చేశారు.



'మహిళా సాధనా శిబిర్' సదస్సులో పాల్గొన్న మహిళలు

క్లుప్తంగా

ఆంజనేయస్వామిని దర్శించుకున్న ఐజీ


ఐజీ చారుసిన్హాకు ఆంజనేయస్వామి చిత్రపటాన్ని బహూకరిస్తున్న దృశ్యం

నల్లచెరువు: మండలపరిధిలోని పాలపాటిదిన్నె ఆంజనేయస్వామిని శనివారం ఐజీ చారుసిన్హా దర్శించుకున్నారు. ముందుగా ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ దేవరింటి భాస్కర్‌రెడ్డి ఐజీకి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఐజీని సత్కరించి ఆలయ విశిష్టత తెలియజేయడంతో పాటు స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. కదిరి రూరల్ సీఐ శంకర్ నాయక్, నల్లచెరువు ఎస్‌ఐ వరలక్ష్మి పాల్గొన్నారు.

కాలు జారి బావిలో పడి రైతు మృతి


తేలియాడుతున్న నారాయణస్వామి మృతదేహం

కూడేరు: కాలు జారి ఓ రైతు బావిలో పడి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని కమ్మూరులో చోటు చేసుకుంది. పోలీసుల వివరాలమేరకు.. కమ్మూరుకు చెందిన రైతు నారాయణస్వామి (32) తన పొలంలో పని నిమిత్తం తన తండ్రి రాముడుతో కలిసి శుక్రవారం పొలానికి వెళ్లాడు. అనంతరం తండ్రి రాముడు ఇంటికి వెళ్లిపోయారు. అయితే నారాయణ స్వామి బావి దగ్గరకు వెళ్లినప్పుడు కాలు జారి నీటిలో పడిపోయాడు. రాత్రి అయినా ఇంటికి రాకపోయే సరికి కుటుంబ సభ్యులు అంతా వెతికినా ఫలితం లేకపోయింది. శనివారం బావి దగ్గరకు వెళ్లి చూడగా నీటిలో నారాయణ స్వామి మృతదేహం కనిపించింది. పోలీసులకు సమాచారమివ్వడంతో మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టంకు తరలించారు. మృతునికి భార్య యశోద, ఇద్దరు కుమార్తెలున్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ వెంకటేష్ తెలిపారు.

భారీగా పరికరాల చోరీ

సోమందేపల్లి: మండలంలోని గుడిపల్లి సమీపంలో ఉన్న కియా అనుబంధ పరిశ్రమ అయిన డీఎస్సీ కంపెనీకు చెందిన రూ.30 లక్షల విలువైన పరికరాలు అపహరించినట్లు కంపెనీ ప్రతినిధి జోనియన్ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. నాలుగు నెలల క్రితం పెనుకొండ వైపు నుంచి తమ కంపెనీకి డెలివరీ ఇవ్వాల్సిన ఎలక్ట్రానిక్ పరికరాలను క్యాంటర్ డ్రైవర్లు, మరికొంతమంది కుమ్మక్కై అపహరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విజయ్ కుమార్ తెలిపారు.

దళితవాడకు ప్రత్యేక శ్మశానం!

- ఆఖరి మజిలీకి ఇబ్బందులు లేకుండా చర్యలు
- భూ కేటాయింపు పూర్తి చేసిన యంత్రాంగం
- ప్రభుత్వ భూమి లేనిచోట ప్రైవేటు నుంచి కొనుగోలుకు సిద్ధం
- హర్షం వ్యక్తం చేస్తున్న ఎస్సీ వర్గాలు


శ్మశాన వాటిక

జిల్లాలోని రెవెన్యూ గ్రామాలు	461
శ్మశాన వాటికలు లేని దళిత వాడలు	144
శ్మశాన వాటికలకు అవసరమైన భూమి	174.67 (ఎకరాలు)
భూ కేటాయింపులు పూర్తి అయిన దళితవాడలు	121
కేటాయించిన భూ విస్తీర్ణం	120.13 (ఎకరాలు)

ప్రశాంతి నిలయం/పెనుకొండ రూరల్: ఊరికి కి.మీ దూరంలోని వాగులు, వంకలు, అటవీ ప్రాంతాలు...ఇన్నాళ్లూ దళితుల శ్మశాన వాటిక కోసం ఉపయోగ పడిన ప్రాంతాలు. అక్కడి వరకూ మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు అగచాట్లు ఎన్నో. వర్షాకాలంలో అయితే ఆ పరిస్థితి పగోడికి కూడా వద్దంటారు. సౌకర్యాలు ఉండవు...సమాధులకు చోటుండదు. అందువల్లే ఆరడుగుల నేల కోసం ఎస్సీలు ఏకంగా పోరాటాలు చేసినా గత ప్రభుత్వాలు పట్టించుకోలేదు. కానీ రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పరిస్థితిలో మార్పు వస్తోంది. తన సుదీర్ఘ పాదయాత్రలో దళితుల కష్టాలు స్వయంగా చూసిన జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుంచి ఎస్సీ వర్గాల సంక్షేమం, ఆత్మగౌరవం కాపాడేందుకు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలోనే ప్రతి దళితవాడకూ ప్రత్యేక శ్మశాన వాటిక ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. ఆయా వాడల జనాభా ఆధారంగా అర ఎకరం నుంచి ఎకరం కేటాయించేలా నిర్ణయించారు. ప్రభుత్వ భూమి అందుబాటులో లేకపోతే ప్రైవేట్ వ్యక్తుల నుంచి కొనుగోలు చేసేందుకు సైతం ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయిలో అధికారులు ఇప్పటికే చర్యలు చేపట్టారు.

124 వాడలకు భూ కేటాయింపు

జిల్లాలో 461 రెవెన్యూ గ్రామాలుండగా, అందులో 144 దళితవాడలకు శ్మశానాలు లేవని అధికారులు గుర్తించారు. ఆయా చోట్ల శ్మశాన వాటికల ఏర్పాటుకు 174.67 ఎకరాల భూమి అవసరమని గుర్తించారు. ఇందులో 124 దళిత వాడల కోసం ప్రత్యేకంగా శ్మశాన వాటిక ఏర్పాటు చేసేందుకు 147.67 ఎకరాల ప్రభుత్వం భూమిని గుర్తించారు. వాటిని రెవెన్యూ రికార్డుల్లో శ్మశానం కోసం కేటాయించినట్లు నమోదు చేసే ప్రక్రియ చేపట్టారు. మరో 20 దళిత వాడలకు సంబంధించి 27 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉంది. ఇప్పటికే 121 దళితవాడలకు సంబంధించి 120.13 ఎకరాల భూమిని రెవెన్యూ రికార్డుల వరంగా కేటాయింపు చేయడంతో పాటు స్థానిక పంచాయతీలకు స్వాధీనం చేశారు. త్వరలోనే కలెక్టర్ అనుమతులతో కేటాయించిన భూముల్లో శ్మశాన వాటికలు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టారు.

భూ కేటాయింపులు పూర్తి



ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా శ్మశాన వాటికలు లేని 144 దళితవాడలు గుర్తించాం. ఆయాచోట్ల శ్మశాన వాటికల ఏర్పాటుకు అవసరమైన ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి కేటాయింపులు పూర్తి చేశాం. ప్రభుత్వ స్థలం అందుబాటులో లేని చోట ప్రైవేటు భూములు సేకరించి శ్మశాన వాటికలు ఏర్పాటు చేస్తాం.

– చేతన్, జాయింట్ కలెక్టర్

గొప్ప నిర్ణయం



దళితవాడలకు ప్రత్యేకంగా శ్మశానాలు లేక ఇన్నేళ్లు మేము చాలా ఇబ్బందులు పడ్డాం. గతంలో పలు మార్లు ప్రభుత్వాల దృష్టికి తీసుకుపోయినా సమస్య పరిష్కారం కాలేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దళితుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కారానికి కృషి చేస్తున్నారు. ప్రతి దళితవాడకు శ్మశాన వాటిక ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయం చాలా గొప్పది.

–మాతంగి తిప్పన్న, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

సీఎం జగనన్నకు కృతజ్ఞతలు



మా గ్రామంలో వంకలు, కుంటలు, చెరువు కట్టలనే శ్మశాన వాటికలుగా ఉపయోగించుకొనే వాళ్లం. వాటికి భద్రత లేకపోవడంతో ఎంతో చింతించేవాళ్లం. అయితే ఇటీవల ప్రభుత్వం ప్రత్యేక జీఓ ఆధారంగా రెవెన్యూ అధికారులను సంప్రదించాము. శాశ్వత పరిష్కారం చూపేందుకు అధికారులు సంసిద్ధత వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి జగనన్నకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం.

– లక్ష్మీనారాయణ, గోనిపేట

12న పోలింగ్ మెటీరియల్ పంపిణీ


చిన్నపల్లి పాఠశాలలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న డీఆర్‌ఓ, అధికారులు

పుట్టపర్తి అర్బన్: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అవసరమైన పోలింగ్ మెటీరియల్‌ను మార్చి 12న పంపిణీ చేయనున్నట్లు డీఆర్‌ఓ కొండయ్య తెలిపారు. శనివారం పుట్టపర్తి పట్టణంలోని చిన్నపల్లి ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేయనున్న స్ట్రాంగ్ రూం, డిస్ట్రిబ్యూషన్ సెంటర్, రిసెప్షన్ కేంద్రం ఏర్పాట్లను పరిశీలించారు. 12న మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నవీన్ కుమార్, ఎన్నికల అధికారి వరసింహులు, సర్వేయర్ లక్ష్మీ, వీఆర్‌ఓ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యానికి తావులేకుండా టీకాలు


సంగాలలో వివరాలు సేకరిస్తున్న జిల్లా ఎయిడ్స్, టీబీ, లెప్రసీ ప్రోగ్రామ్ అధికారి తిప్పయ్య

బత్తలపల్లి: నిర్లక్ష్యానికి తావులేకుండా గర్భిణులకు, పుట్టిన ప్రతి బిడ్డకూ వ్యాధి నిరోధక టీకాలను సకాలంలో అందివ్వాలని జిల్లా ఎయిడ్స్, టీబీ, లెప్రసీ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ తిప్పయ్య తెలిపారు. శనివారం మండలంలోని చెన్నరాయపట్నం, సంగాల గ్రామాల్లో ఆయన వైద్య సిబ్బందితో కలిసి వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా తిప్పయ్య ఆయా గ్రామాల్లో వ్యాధిగ్రస్తులు, గర్భిణులు, చిన్నారుల కుటుంబాలను కలిసి వివరాలు తెలుసుకున్నారు.

ప్రతిపక్షాల కుట్రలను ప్రజలు నమ్మరు

- ప్రభుత్వానికి, టీచర్లకు మధ్య దూరం లేదన్న ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి


కేజీబీవీలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి

లేపాక్షి: మండల కేంద్రంలోని ఏపీ గురుకుల పాఠశాల, కస్తూర్బాగాంధీ విద్యాలయం, వివేకానంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులతో మాట్లాడారు. డిజిటల్ విద్య, బైజూస్, జగనన్న విద్యాకానుక తదితర విషయాలపై ఆమె ఆరా తీశారు. అలాగే మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించి నాణ్యత ఎలా ఉందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. 8వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన ట్యాబ్‌లను పరిశీలించి వాటిని ఎలా ఉపయోగిస్తున్నారో తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్సీ విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వానికి, ఉపాధ్యాయులకు మధ్య దూరం ఉందనే ప్రచారం అవాస్తమని తెలిపారు. ప్రతిపక్షాలు ఇలాంటి కుట్రలు ఎన్నిచేసినా ప్రజలు నమ్మరన్నారు. అన్ని విధాలా విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నది మాత్రం జగనన్న ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ వెంట ఎంఈఓ నాగరాజు ఉన్నారు.

నకిలీ బంగారంతో మోసానికి యత్నం

- మహిళను అదుపులోకి తీసుకున్న పోలీసులు

తాడిపత్రి: బంగారు ఆభరణాల స్థానంలో నకిలీ నగలను ఉంచి ఓ బంగారు షాపు యజమానిని బురిడీ కొట్టించేందుకు యత్నించింది ఓ మహిళ. శనివారం తాడిపత్రిలోని ఓ బంగారు దుకాణంలో ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసుల వివరాలమేరకు.. ప్రొద్దుటూరుకు చెందిన నరసమ్మ ఆమె కుమారుడు అశోక్‌తో కలసి తాడిపత్రి పట్టణంలోని ఓ బంగారు దుకాణంలో ఆభరణాలు కొనుగోలు చేసేందుకు వచ్చింది. ఆ సమయంలో అసలు బంగారు ఆభరణాలను తీసుకుని, తన వద్ద ఉన్న నకిలీ బంగారు ఆభరణాలను ఒరిజనల్ స్థానంలో ఉంచింది. అవి నకిలీవని గుర్తించిన బంగారు షాపు యజమాని ఆమెను నిలదీయడంతో పాటు చుట్టుపక్కల బంగారు వ్యాపారస్తులతో కలసి సదరు మహిళతో పాటు ఆమె కుమారుడిని పట్టణ పోలీసులకు అప్పగించారు. పోలీసులు వారిని విచారిస్తున్నట్లు తెలిసింది.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి


మృతుడు రాజు


బోయ శివయ్య

మడకశిర (అగళి): జిల్లాలో జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. అగళి మండలంలోని హుల్లికెర వద్ద జాతీయ రహదారిపై శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో కర్ణాటక రాష్ట్రం మధుగిరి తాలూకా తెంపచెన్నహళ్లికి చెందిన రాజు (30)అనే వ్యక్తి చనిపోయారు. వివరాల్లోకి వెళితే.... అగళి మండలం మధూడికి చెందిన ఓ పూల వ్యాపారి శిర వైపు నుంచి వస్తుండగా కారు టైర్ పంక్చర్ కావడంతో అదుపు తప్పి పల్టీలు కొట్టింది. అదే సమయంలో అగళి వైపు నుంచి వస్తున్న మోటార్ బైక్‌ను వేగంగా ఢీకొంది. ఈ ఘటనలో మోటార్ బైక్ నడుపుకుంటూ వస్తున్న రాజు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు పట్టనాయకనహళ్లి సమీపంలోని తన అక్క ఊరికి వెళ్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. మృతుడికి భార్యతో పాటు రెండేళ్ల పాప ఉన్నట్లు తెలిసింది. ఎస్‌ఐ లావణ్య ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

గోరంట్ల: మండల పరిధిలోని బెల్లాలచెరువు గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పెనుకొండ మండలం వెంకటగిరిపాళ్యం గ్రామానికి చెందిన బోయ శివయ్య (55) మృతిచెందినట్లు ఎస్‌ఐ ఇక్బాల్ బాషా పేర్కొన్నారు. ఎస్‌ఐ వివరాల మేరకు... వెంకటగిరిపాళ్యానికి చెందిన నాగేంద్ర, శివయ్య ద్విచక్ర వాహనంలో పాలసముద్రం నుంచి స్వగ్రామానికి వెళ్తున్నారు. అయితే మార్గమధ్యలో బెల్లాలచెరువు వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పింది. ఈ ఘటనలో ద్విచక్ర వాహనం వెనుక కూర్చున్న శివయ్య అక్కడికక్కడే మృతి చెందారు. నాగేంద్ర స్వల్పంగా గాయపడ్డారు. నాగేంద్రను 108 వాహనంలో హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

జర్నలిజానికే వన్నె తెచ్చిన వ్యక్తి తిమ్మారెడ్డి




తిమ్మారెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దేవులపల్లి అమర్, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్ రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మాజీ జడ్జి కిష్టప్ప తదితరులు, కార్యక్రమానికి హాజరైన జర్నలిస్టులు, పుర ప్రముఖులు

- రాష్ట్ర ప్రభుత్వ జాతీయ మీడియా సలహాదారు దేవులపల్లి అమర్

అనంతపురం కల్చరల్: విలువలతో కూడిన జర్నలిజంతో ఈ రంగానికి వన్నె తెచ్చిన వ్యక్తి తిమ్మారెడ్డి అని రాష్ట్ర ప్రభుత్వ జాతీయ మీడియా సలహాదారు దేవులపల్లి అమర్ అన్నారు. ఆయన ఆశయాలు, సిద్ధాంతాలపై మంచి పుస్తకం తీసుకురావాల్సిన అవశ్యకత ఉందని తెలిపారు. సీనియర్ జర్నలిస్టు తిమ్మారెడ్డి 23వ వర్ధంతి సభ శనివారం స్థానిక లలితకళాపరిషత్తులో నిర్వహించారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన దేవులపల్లి అమర్ మాట్లాడుతూ తిమ్మారెడ్డి తనకెంతో ఆప్తుడన్నారు. జర్నలిజంలోకి ఒకప్పుడు సమాజ శ్రేయస్సును కాంక్షించేవారు వచ్చేవారని, నేడు పత్రికాధిపతులే సంఘ వ్యతిరేక శక్తులను ప్రోత్సహిస్తూ విలువలను దిగజారుస్తున్నారన్నారు. కేవలం ఆర్థిక స్వావలంబన, సొంత ప్రయోజనాలకే ఒక వర్గం మీడియా పనిచేస్తోందన్నారు. తాము కోరుకుంటున్న వారే ప్రభుత్వాలను నడపాలనుకుంటున్నారని మండిపడ్డారు. కొన్ని వార్తాపత్రికలు, చానళ్ల అరాచకాలతో ప్రజలు జర్నలిస్టులను చులకనగా చూస్తున్నారన్నారు. మానవత్వంతో ప్రజలకు మంచి చేస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని గద్దె దించడమే లక్ష్యంగా కొన్ని వార్తా సంస్థలు సాగిస్తున్న వికృత చేష్టలపై ఎంత మాట్లాడినా తక్కువేనన్నారు. నిస్సిగ్గుగా అసత్యాలనే కథనాలుగా వండివారుస్తుండడం బాధాకరమన్నారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్య అతిథి జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ కరోనా సమయంలో జర్నలిస్టుల తెగువ ఎంతో మందికి స్ఫూర్తినిచ్చిందన్నారు. పెన్ను పట్టిన సైనికులుగా జర్నలిస్టులను అభివర్ణించారు. బీసీ కమిషన్ మెంబర్, విశ్రాంత న్యాయమూర్తి క్రిష్టప్ప మాట్లాడుతూ జర్నలిస్టులను తమ స్వార్థప్రయోజనాల కోసం కొందరు వాడుకోవడం విచారకరమన్నారు. తిమ్మారెడ్డి ఆశయాలను కొనసాగించాలని కోరారు. కమ్యూనిస్టు నాయకులు వీకే రంగారెడ్డి, సూర్యనారాయణరెడ్డి, సీనియర్ జర్నలిస్టులు ఆజాద్, రామాంజనేయులు తదితరులు తిమ్మారెడ్డితో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. వామపక్ష భావజాలాన్ని, రాయలసీమ ఉద్యమ అవసరాన్ని ప్రపంచానికి చాటడంలో ఆయన చేసిన కృషిని కొనియాడారు. అనంతరం 40 మంది సీనియర్ జర్నలిస్టులను సన్మానించారు. విశ్వనాథ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్ రెడ్డి, మానవతా తరిమెల అమరనాథరెడ్డి, సీనియర్ జర్నలిస్టులు పతకమూరి నాగరాజు, సీనియర్ న్యాయవాది ఐదుకల్లు రవి, ఎల్కేపీ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటసుబ్బయ్య, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

పాముకాటుతో చిన్నారి మృతి


వినయ్ (ఫైల్)

ఉరవకొండ: పట్టణంలోని శివరామిరెడ్డి కాలనీలో నాగరాజు, రేణుకమ్మ దంపతుల కుమారుడు వినయ్ (2) శనివారం పాము కాటుతో మృతి చెందాడు. మృతుని తల్లిదండ్రుల వివరాలమేరకు.... ఇంట్లోనే ఆడుకుంటున్న చిన్నారి వినయ్ ఒక్కసారిగా స్పృహ తప్పి పడిపోయాడు. గమనించిన తల్లిదండ్రులు చిన్నారి కాళ్ల మీద పాము కాట్లు ఉండటం గమనించారు. వెంటనే ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ వినయ్ మృతి చెందాడు. కాలనీవాసులతో కలిసి ఎంబీసీ కార్పొరేషన్ డైరెక్టర్ జోగి వెంకటేష్ పాము కోసం ఇంట్లో సోదించగా నాగుపామును గుర్తించి వెంటనే దాన్ని కొట్టి చంపారు. అల్లారుముద్దుగా పెంచుకున్న కుమారుడు పాము కాటుతో చనిపోవడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

రేషన్ బియ్యం పట్టివేత

తాడిపత్రి: పట్టణంలోని టైలర్స్ కాలనీ వద్ద వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 29 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని శనివారం పట్టుకున్నట్లు పట్టణ సీఐ ఆనందరావు తెలిపారు. యల్లనూరు గ్రామానికి శివకుమార్, కళ్యాణ్ బొలెరో పికప్ వాహనంలో అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వారిపై కేసు నమోదు చేసి, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. రేషన్ బియ్యం బస్తాలను సివిల్ సరఫరాలశాఖ అధికారులకు అప్పగించినట్లు సీఐ ఆనందరావు పేర్కొన్నారు.